విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com కర్నూలు, శనివారం 6, సెప్టెంబరు 2025

శాంతి, దయ, కరుణకు ప్రతీక మిలాద్ ఉన్ నబీ

సీపీఐ కార్యవర్గ సభ్యుడు కె.రహీం

విశాలాంధ్ర-పామిడి: మహమ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్-ఉన్-నబీ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పామిడి పట్టణంలో ప్రతి వాడవాడలా శాంతి ర్యాలీలతో ప్రవక్తకు నీరాజనాలర్పించారు. మసీదులను విద్యుద్ దీపకాంతులతో సుందరంగా అలంకరించారు. బొడ్రాయి దగ్గర ఈద్గా మసీదు వద్ద కలిసి స్టేట్ బ్యాంక్ వద్ద ఉన్న మసీదు వరకు శాంతి ర్యాలీ చేశారు. ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఇస్లాం మత స్థాపకుడైన ముహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, దయ, కరుణ, ఐక్యత వంటి గొప్ప విలువలను ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటా అన్నారు.

ప్రభుత్వ భూమిని కాజేసిన అధికారి కుటుంబం

- పేదలకు దక్కేవరకు ఆందోళన... సీపీఐ

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం : బుక్కరాయ సముద్రం మండలం జంతులూరు గ్రామానికి చెందిన సర్వే నెం.276/2,276/4 గల ఐదు ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని గతంలో బుక్కరాయసముద్రం మండలంలో వీఆర్ఒగా పని చేస్తున్న కుమార్‌స్వామి అధికార దుర్వినియోగానికి పాల్పడి తన బార్య,అత్తయ్య పేర్ల మీద రైతు వారి పట్టా చేయించుకొని కుమార్ స్వామి స్వాధీనంలో నున్న భూమిని శుక్రవారం అనంతపురం సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణ స్వామి ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా పాళ్యం నారాయణస్వామి మాట్లాడుతూ వీఆర్ఒ కుమార్ స్వామి ప్రభుత్వ ఉద్యోగి అయి వుండి తన ఇంట్లో వారి పేరున భూమిని డి.పట్టా చేయించడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. గతంలో ఈ భూమి జంతులూరు దళితుల పేరుపై వుండేదని రికార్డుల నుండి దళితుల పేర్లు తొలగించి మండల స్థాయి అధికారులను లోబరుచుకొని ఇంట్లో వారిపేరున డి.పట్టా చేయించుకొన్న విషయాన్ని తహశీల్దారు దృష్టికి పలు మార్లు సీపీఐ ఆధ్వర్యంలో తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం లేదని ఈ భూమి పేదలకు దక్కేవరకు సిపిఐ ఆధ్వర్యంలో దళిత, పేదల తరుపున ఆందోళన చేస్తుందని పేర్కొన్నారు. ఈ విషయంపై వీఆర్ఓ అక్రమాలపై త్వరలోనే కలెక్టరు దృష్టికి తీసుకెళుతామని.. వీఆర్ఒ ఆక్రమించిన ప్రభుత్వ భూమిని ఈ ప్రాంత పేదలకు పట్టాలు ఇవ్వాలనే వాటిపై సీపీఐ, గ్రామస్తులతో కలిసి ఆందోళన చేస్తామన్నారు. అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగై వుండి ప్రభుత్వ భూమినే కాజేసినందుకు చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరును కోరుతామన్నారు. ఈ కార్యక్రమంలో శింగనమల సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి తలారి నారాయణస్వామి, బుక్కరాయ సముద్రం మండల కార్యదర్శి బండి రామకృష్ణ, జంతులూరు సిపిఐ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది..

- ఉపాధ్యాయులకు సెల్యూట్..
- కలెక్టర్ వినోద్ కుమార్

విశాలాంధ్ర-అనంతపురం : ఎంతో పవిత్రమైన వృత్తిని చేస్తున్న ఉపాధ్యాయులు అందరికీ సెల్యూట్ చేస్తున్నామని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి పేర్కొన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలోని డ్రామా హాల్‌లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురు పూజోత్సవం కార్యక్రమంలో భాగంగా అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వేంకటేశ్వర ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించగా.. కార్యక్రమంలో జడ్పి చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా ఉపాధ్యా యులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, గురు పూజోత్సవం కార్యక్రమంలో పాల్గొనడం, ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించుకోవడం ఎంతో సంతోషం గా ఉందన్నారు. జడ్పీ చైర్పర్సన్ మాట్లాడుతూ ఉత్తమ అవార్డులు పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వేంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ పూర్వజన్మ సుకృతం ఉంటేకానీ టీచర్ బాధ్యత దొరకదని, దీనితో ఎంతోమంది గొప్ప గొప్పవారిని తీర్చిదిద్దే అవకాశం ఉంటుందన్నారు. కలెక్టర్‌ను కానీ, ప్రజా ప్రతినిధులను, అధికారులను తదితర గొప్ప గొప్ప వారిని తీర్చిదిద్దే గొప్ప దేవుళ్ళు ఉపాధ్యాయులే అని పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఎమ్మెల్యే, జడ్పీ చైర్పర్సన్, కలెక్టర్ శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఈఓ ప్రసాద్ బాబు, సమగ్ర శిక్ష ఏపిసి శైలజ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో ఆసుపత్రి వద్దు

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: పాఠశాల ఆవరణలో పీహెచ్‌సీ నిర్మాణాన్ని చేపట్టాలన్న ఆలోచన విరమించుకోవాలని, లేనిపక్షంలో గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు ఇతర రాజకీయ పార్టీ నాయకులతో కలసి ఆందోళన చేస్తామని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ హెచ్చరించారు. శుక్రవారం కళ్యాణదుర్గంలోని ఎస్వీఎస్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతు, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి బుడెన్ గ్రామ ప్రజలు విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి మాట్లాడారు. గతేడాది కుందుర్పి మండలం ఏనుములదొడ్డి గ్రామంలో ఆరోగ్య కేంద్రం శాంక్షన్ అయిందని, గ్రామ ప్రజలు భూమిని దానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు తసిల్దార్, ఆర్డీవో, జిల్లా కలెక్టర్‌తో పాటు డిఎంహెచ్ఓలకు వినతిపత్రం అందజేశారున్నారు. ఎంఈఓ, డిఈఓ సైతం స్కూల్లో వద్దని చెప్పారు అన్నారు. అయినా కొందరు ఫ్యూడల్ పెత్తందారి భావజాలంతో స్కూల్ ఆవరణలోనే నిర్మించడానికి సిద్దపడ్డారని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాము అన్నారు. 40 సంవత్సరాల క్రితమే స్కూల్ అక్కడ నిర్మాణం జరిగిందని, 11 సంవత్సరాల కింద ప్రహరీ గోడ నిర్మించారు అన్నారు. స్కూలు ఆవరణలో ఎటువంటి ఇతర నిర్మాణాలు చేపట్టకూడదని హైకోర్టు ఉత్తర్వులు స్పష్టంగా ఉన్న, అక్కడే నిర్మాణం చేపడతామని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. ఎమ్మెల్యే తక్షణం స్పందించి దాతలు ఇస్తామన్న భూమి పరిశీలనకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు నాగరాజు, బొమ్మలింగ, తిప్పేస్వామి, దినేష్, ఆనంద్, ఆంజనేయులు, బాధపల్లెప్ప, రామచంద్ర, శ్రీరాములు, బాబు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోవిందుకు సన్మానం

శాలాంధ్ర-గుంతకల్లు: సీపీఐ పార్టీలో పనిచేస్తూ అనేకమంది పేదలకు బడుగు బలహీన వర్గాలకు వారు అభివృద్ధికి తోడ్పాటు అందిస్తు అనేక పోరాటాలు చేసిన గొప్ప మహా వ్యక్తి గోవిందు అని ఆనంద్ కొనియాడారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక వాసవి థియేటర్‌లో ఆనంద్ రెడ్డి, దబ్బర నారాయణ మిత్ర బృందం గుంతకల్ పట్టణానికి చెందిన బి గోవింద్ ను ఘనంగా సన్మానించినారు. ఈ సభకు అధ్యక్షనిగా లోకేంద్ర, పత్తి సర్వేశ్వర ప్రసాద్ వ్యవహరించగా ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ గత 46 సంవత్సరాలుగా గోవిందు అనేకమంది పేదలకు, బడుగు బలహీన వర్గాలకు ఇంటి పట్టాలను మంజూరు చేయించడంలోనూ వారి అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్న గోవిందును రాష్ట్ర సమితిలోకి స్థానం కల్పించడం మన గుంతకల్ పట్టణానికి మన అనంతపురం జిల్లాకు గర్వకారణమని తెలియజేశారు. సర్వేశ్వరరావు ప్రసాద్ మాట్లాడుతూ గోవిందు స్నేహానికి చాలా విలువ ఇస్తున్నాడని అతని స్వభావం చాలా మంచిదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు శ్రీకాంత్, రామన్న, హనుమేష్, కదిరప్ప, బండారి పురుషోత్తం, మిత్రులు మంజునాథ్, అమీర్, భాష మరియు నారాయణ, నూర్, రాజేష్, కార్తీక్, అశోక్, సంజీవ్, భాస్కర్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ అక్రమ తరలింపును అడ్డుకోండి..

- పీఏపీఆర్ డ్యాంకు పొంచి ఉన్న ప్రమాదం
- సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.కేశవరెడ్డి డిమాండ్

విశాలాంధ్ర-కూడేరు: మండల పరిధిలోని పిఏపీఆర్ దాం ఆనకట్ట పై నుంచి అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ తరలింపును అడ్డుకోవాలని సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు బి కేశవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ సేశారు గురువారం సిపిఐ మండల కార్యదర్శి నాగేంద్ర ఆధ్వర్యంలో పి.ఏ.బి.ఆర్. డ్యామ్ అనకట్ట పై జరుగుచున్న అక్రమ తరలింపు ప్రాంతాన్ని సిపిఐ బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ డోన్ పట్టడానికి చెందిన రాఘవరెడ్డి ప్రభుత్వ అనుమతులు లేకుండా కోట్ల రూపాయల విలువచేసే అక్రమ మైనింగ్ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు గ్రానైట్ బ్లాక్స్ తవ్వడం తరలించడం వంటి పనులను చేస్తున్నారన్నారు దీంతో డ్యాం కట్టకు ప్రమాదము జరిగే అవకాశం ఉందన్నారు 11 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన డ్యాముకు అడ్డుకట్ట అయిన. కొండగుట్ట లోని అక్రమ మైనింగ్ తరలించడంతో డ్యాంకు ప్రమాదం ఏర్పడే పరిస్థితి నెలకొంటుందన్నారు సరైన రాయల్టీ టాక్స్ లు ప్రభుత్వానికి చెల్లించకుండా అక్రమంగా వ్యాపారం చేస్తున్నారన్నారు. మైనింగ్ లీజు లేకుండా వ్యవహరిస్తున్నారని, దీంతో పర్యావరణం నాశనం అవుతుందన్నారు.. దీనిపై మైనింగ్ డిపార్ట్మెంట్ వారు చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు లేనిచో అనంతపురంలోని మైనింగ్ ఆఫీసు ముందు సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ తాలూకా కార్యదర్శి జే. మల్లికార్జున జిల్లా కమిటీ సభ్యులు పెరుగు సంగప్ప రైతు సంఘం మండల కమిటీ అధ్యక్షులు రమణ సిపిఐ మండల సహాయ కార్యదర్శి వెంకటేశులు నాయకులు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

సీఎం బహిరంగ సభను జయప్రదం చేయండి

ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

విశాలాంధ్ర-శింగనమల : అనంతపురం నగర శివారున సెప్టెంబర్ 10వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , కూటమి పార్టీల నేతలు పాల్గొనే "సూపర్ సిక్స్ - సూపర్ హిట్" బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇది ప్రజా రంజికపాలనని, నిరంతరం ప్రజల కోసం పాటుపడి, ప్రజల క్షేమం కోసం, నిరంతరం శ్రమిస్తుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ గా అమలు చేసామని, ఈ గణతంత్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నూతిమడుగు బ్రిడ్జికి తాత్కాలిక మరమ్మతులు..

విశాలాంధ్ర- కళ్యాణదుర్గం: కంబదూరు మండలం నూతిమడుగు వద్ద పెన్నా నదిపై బ్రిడ్జి కూలిపోయిన సంగతి తెలిసిందే. ఆర్అండ్‌బి అధికారులు పట్టించుకోకపోవడంతో శుక్రవారం గ్రామస్తులు చేయిచేయి కలిపి తాత్కాలిక మరమ్మతులు చేశారు. వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోలేదు. పూర్తిస్థాయి మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరారు.

8న సీపీఐ ధర్నాకు తరలిరండి

విశాలాంధ్ర-కూడేరు : కూడేరు మండలానికి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని. మండలంలో నెలకొన్న యూరియా. తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టునున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి కేశవరెడ్డి తెలిపారు. గురువారం సీపీఐ కార్యాలయంలో పార్టీ మండల సమితి సమావేశాన్ని సీపీఐ మండల కార్యదర్శి నాగేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. కేశవ రెడ్డి మాట్లాడుతూ మండలానికి దాదాపు రెండు సంవత్సరాలుగా రెగ్యులర్ తహసీల్దారు లేక రైతులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే రెగ్యులర్ తహసీల్దారును నియమించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ తాలూకా కార్యదర్శి జె.మల్లికార్జున సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు పెరుగు సంగప్ప సీనియర్ నాయకులు ముట్టాల శ్రీరాములు. రమణప్ప రైతు సంఘం మండల కార్యదర్శి రమణ మండల సహాయ కార్యదర్శి మలరాయుడు వెంకటేష్ నాయకులు సంజీవపురం వెంకటేష్ చోళ సముద్రము ముత్యాలన్న. ఓబులేసు ధనరాజ్ మహిళా నాయకురాలు అస్వత్తమ్మ పాల్గొన్నారు.

బినామీలకు కట్టబెట్టేందుకే మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తన బినామీలు, అనుచరులకుకట్టబెట్టేందుకే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ చేస్తున్నారని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో పేదలకు వైద్య విద్యను దూరం చేసే కుట్రలో భాగంగానే కేబినెట్ నిర్ణయాలు ఉన్నాయన్నారు. శుక్రవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 15 నెలలుగా ప్రజా వ్యతిరేక విధానాలు తీసుకుంటోందన్నారు. "పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేయడానికి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొచ్చారని, ఆ తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు.. వాస్తవానికి 2019 వరకు రాష్ట్రంలో 11 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు మాత్రమే ఉండి అందులో 2185 ఎంబీబీఎస్ సీట్లు మాత్రమే ఉండేవి. వైఎస్ జగన్ సీఎం అయ్యాక 2550 ఎంబీబీఎస్ సీట్లు సమకూర్చేలా 17 మెడికల్ కళాశాలలకు శ్రీకారంచుడితే వాటిలో 10 కళాశాలలను ఈ ప్రభుత్వం ప్రైవేట్ పరం చేస్తోందని,, పెనుకొండలో నిర్మాణంలో ఉన్న కళాశాలను కూడా పీపీపీ పేరుతో ప్రైవేట్‌కు అప్పగిస్తోందని ధ్వజమెత్తారు. నిర్ణయాలపై ఉద్యమిస్తామని హెచ్చరించారు.

పేదలకు వైద్య విద్య దూరం చేసేందుకు కుట్రలు

ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డి

విశాలాంధ్ర-ఉరవకొండ: రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేసి పేదలకు వైద్య విద్యను దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఉరవకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడానికి దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొచ్చారని అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని.. ల్ల రాష్ట్రంలో పేద మధ్యతరగతి కుటుంబాలకు వైద్య విద్యకు పెద్దపీట వేస్తూ రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలోనే 750 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి తెచ్చారని పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం 10 మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడానికి కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడం శోచనీయమన్నారు. చంద్రబాబు బినామీలకు కట్టు పెట్టేందుకే ఈ కుట్ర చేశారని వెంటనే ఉపసంహరించాలన్నారు.

ఖాతాదారుల సేవ కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : మండలంలోని నేమకల్లు గ్రామంలో హీరేహాల్ భారతీయ స్టేట్ బ్యాంక్ పరిధిలో ఖాతాదారుల సేవ కేంద్రాన్ని బ్రాంచ్ మేనేజర్ రాజేష్ శుక్రవారం ప్రారంభించారు. ఖాతాదారుల సేవ కేంద్రానికి సిఎస్‌పిగా కురుబవసంత్ కుమార్‌ను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాతాదారులకు సీఎస్పీఎల్లప్పుడూ సేవలందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పరమేశ్వర, గాలి బసప్ప, బెల్లి హనుమంతు రెడ్డి, పాల్గొన్నారు.

మిట్స్‌లో ఘనంగా ఓణం పండుగ..

విశాలాంధ్ర-జేఎన్టీయూఏ: మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ , సైన్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ లో ఒణం పండుగను విద్యార్థులు ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమాన్ని యూనివర్సిటీ ప్రో-ఛాన్సలర్ యెన్ ద్వారకానాథ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పండుగలు మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలు అని.. ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి, తెలంగాణలో బతుకమ్మ, బోనాలు, తమిళనాట దీపావళి ఎంత ప్రసిద్ధి చెందాయో, కేరళ రాష్ట్ర పండుగ ఓనం కూడా ఆ రాష్ట్ర సంస్కృతికి ప్రతీక అని అన్నారు. ముగ్గు, సాంప్రదాయ నృత్యాలు, పాటలు, ఆటలతో వేడుకలను ఉత్సాహభరితంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ కల్చరల్ కోఆర్డినేటర్ వై ప్రదీప్ కుమార్, సాక్ కోఆర్డినేటర్ డాక్టర్ రెడ్డి హేమంత, ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

స్వర్ణకారులకు సరుకులు పంపిణీ..

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని పెద్ద బజార్‌లో ఉన్న స్వర్ణకారుల సంక్షేమ సంఘం కార్యాలయం వద్ద శుక్రవారం మిలాద్ నబీ సందర్భంగా స్వర్ణకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో 22 మంది స్వర్ణకారులకు ప్యాకెట్ బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకారుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు టిఎం. షబ్బీర్, ఎస్. బషీర్ భాష, సెక్రటరీ సలీం భాష, ట్రెజరర్ ఖాజా, గౌరవ సలహాదారుడు తాజుద్దీన్, మఖబ్బుల్ బాషా, శామీర్ భాష, నజీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు..

విశాలాంధ్ర-యాడికి : మండల వ్యాప్తంగా శుక్రవారం మిలాద్ ఉన్ నబి మహమ్మద్ ప్రవక్త 1500 వ జన్మదిన వేడుకలు ముస్లిం సోదరులు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఉదయం మసీదులో ప్రత్యేక ప్రార్థనల అనంతరం అలంకరించిన మక్కా మదీనా ప్రతిమలను ఓ వాహనంపై ఉంచి గంధాన్ని తలపై ఉంచుకుని ప్రవచనాలు చదువుతూ ఊరేగింపు చేశారు.

జ్ఞాన దీప్తి సర్వేపల్లి రాధాకృష్ణ

విశాలాంధ్ర-జేఎన్టీయూఏ : జ్ఞాన దీప్తి డా.సర్వేపల్లి రాధా కృష్ణ అని జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య హెచ్ సుదర్శన్ రావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య పేర్కొన్నారు. శుక్రవారం కళాశాల ఆవరణంలో ఉన్న డాక్టర్ సర్వేపల్లి రాదా కృష్ణన్ విగ్రహానికి పూల మాలలు వేసి, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ డాక్టర్ సర్వేపల్లి రాదా కృష్ణన్ చిత్ర పటానికి ఉపకులపతి, రిజిస్ట్రార్, ఓఎస్డి వీసీఆచార్య ఎస్.దేవన్న పూలమాలలు వేసి నివాళ్ళు అర్పిం చారు. ఉపకులపతి మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దడంలో అధ్యాపకుల పాత్ర కీలకమైనది అన్నారు. ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుం ధర, డైరెక్టర్లు సత్యనారాయణ, భానుమూర్తి, వైశాలి ఘోర్పడే, పాల్గొన్నారు.

9న ఎరువుల కొరతపై ఆందోళన

విశాలాంధ్ర-ఉరవకొండ: ఎరువుల కొరత తీర్చాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నా ప్రభుత్వానికి ఏమాత్రం పట్టడం లేదని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వై.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆ పార్టీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యకులు మేకల సిద్ధార్థ్ అధ్యక్షతన జరిగిన సమావేశం అనంతరం మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఈనెల 9న గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

ఉపాధి వేతనాల కోసం ఎదురుచూపు

విశాలాంధ్ర-శింగనమల : గ్రామీణ ప్రాంతాల్లో కూలీల వలసలను ఆపేందుకు కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఉపాధి పని చేసిన 15 రోజులకు ఒకసారి బిల్లులు చెల్లించాలనే నిబంధన చట్టంలో ఉంది, అయితే కార్మికులకు గత మూడు నెలల కింద పనిచేసిన మూడు వారాల వేతనాలు పెండింగ్లో ఉన్నాయి, ఇంతవరకు అధికారులు దీనిపై దృష్టి పెట్టిన దాఖలాలు లేవు. దీంతో కుటుంబ పోషణ భారమై ఉపాధి కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుక్కరాయసముద్రంలో 121632, గార్లదిన్నెలో 74659 నార్పలలో 1118 21, పుట్లూరులో 970 20, శింగనమలలో 11 22 32, ఎల్లనూరులో 110 343,మంది మొత్తం ఉపాధి శ్రామికులు 515475 మంది శింగనమల నియోజకవర్గం వ్యాప్తంగా ఉపాధి హామీ శ్రామికులున్నారు, జాబ్ కార్డు ఉన్న శ్రామికులకు ప్రతిరోజు ఫీల్డ్ అసిస్టెంట్లు మస్టర్లు ఇచ్చి పనులు చూపించి హాజరు వేస్తారు. శ్రామికులు చేసిన పనులకు టెక్నికల్ అసిస్టెంట్లు కొలతలు వేసి 15 రోజులకు ఒకసారి వేతనాలు చెల్లించడానికి ఆయా మండలాల ఏపీఓల ద్వారా ఎంపీడీవోలకు ప్రతిపాదనలు పంపిస్తారు. అప్పుడు ఎంపీడీవోలు శ్రామికుల ఖాతాల్లో వేతనాలు వేయాల్సి ఉంటుంది. అయితే జూన్ జూలైలో చేసిన పనికి సంబంధించిన బిల్లులన తక్షణమే చెల్లించి ఆదుకోవాలని కూలీలు కోరుతున్నారు.

సూపర్ సిక్స్ హామీలను.. సూపర్ హిట్ చేశాం

మంత్రి కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర-అనంతపురం: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. అలాగే సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేశామని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకున్నందుకు ఎంతో సంతోషం గా ఉందన్నారు. ఈనెల 10న నిర్వహించనున్న సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ కార్యక్రమం రాష్ట్రస్థాయి సభ నిర్మాణఏర్పాట్లను పరిశీలనార్థం మంత్రి జిల్లా పర్యటనకు విచ్చేశారు. స్థానిక రోడ్లు భవనాల శాఖ విశ్రాంతిభవనంలో అలాగే జిఎంఆర్ ఇంద్రప్రస్థ మైదానంలో జరిగే ముఖ్యమంత్రి సభ వద్ద మీడియా ప్రతినిధులతో వేర్వేరుగా మాట్లాడారు.రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో తీసుకెళ్ళేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కట్టుబడి ఉందని తెలిపారు. ముఖ్యంగా హామీ మేరకు జూలై నుండే రూ.4 వేలు పెన్షన్ అందించామని, దివ్యాంగులకు రూ. 6వేలు, పూర్తిగా అనారోగ్యాల కారణంగా కదలని స్థితిలో ఉన్న వారిని అర్హులుగా గుర్తించి వారికి రూ.15 వేల చొప్పున పెన్షన్ అందిస్తున్నామని అలాగే దీపం పథకంతో సుమారు 2 కోట్ల మందికి ఉచితంగా గ్యాస్ సిలిండర్లను అందించడం జరుగుతున్నదని తల్లికి వందనంతో ప్రతి బిడ్డకి ఆర్థిక సాయం, అన్నదాత సుఖీభవ పథకంతో 67 లక్షల మంది రైతులకు ఆర్థిక భరోసా అందించామని పేర్కొన్నారు

త్వరలో శ్రీకృష్ణ దేవరాయుల ఉత్సవాల నిర్వహణ

- 10న అనంతపురంలో సూపర్ సిక్స్-సూపర్ హిట్ విజయోత్సవ సభ
- హాజరుకానున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ : మంత్రి సవిత

విశాలాంధ్ర-గోరంట్ల: త్వరలోనే శ్రీకృష్ణదేవరాయల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. గోరంట్ల మండల కేంద్రంలో శ్రీకృష్ణ దేవరాయుల విగ్రహ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ, భారతదేశాన్ని పాలించిన వారిలో శ్రీకృష్ణదేవరాయులు గొప్ప చక్రవర్తన్నారు. తన పాలనలో రాయలసీమను రతనాల సీమగా తీర్చిదిద్దారన్నారు. చెరువులు, కాలువలు ఏర్పాటు చేశారన్నారు. దేవాలయాలను నిర్మించి మత సామరస్యానికి కృషి చేశారన్నారు. ప్రస్తుత పెనుకొండనే తన రెండో రాజధానిగా చేసుకుని, విజయనగర సామ్రాజ్యాన్ని శ్రీకృష్ణదేవరాయులు పాలించారన్నారు. తన తండ్రి పేరున శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. విజయనగర సామ్రాజ్య పాలకుడిగా శ్రీకృష్ణదేవరాయులు ప్రజాక్షేమానికి అధిక ప్రాధాన్యమిచ్చారని మంత్రి సవిత తెలిపారు. మారు వేషంలో పర్యటిస్తూ, ప్రజల కష్టాలను తెలుసుకునే వారన్నారు. ఆయన స్ఫూర్తితోనే సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు. రాయలసీమను రతనాల సీమగా మార్చాలన్న సంకల్పంతో సాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో పర్యటిస్తున్నారన్నారు.

శ్రీకృష్ణదేవరాయలు ఉత్సవాల నిర్వహణపై ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడితో చర్చించామని.. పెనుకొండలో ఉన్న కొండపై నర్సింహస్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంతో పాటు శ్రీకృష్ణదేవరాయల ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. లేపాక్షి ఉత్సవాలు కూడా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. త్వరలోనే ఈ ఉత్సవాలపై ఒక ప్రకటన చేస్తామన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు, గోరంట్లలో కాపు భవనం నిర్మాణానికి 50 సెంట్లు కేటాయించామని, త్వరలోనే భవన నిర్మాణ పనులు కూడా ప్రారంభిస్తామని మంత్రి సవిత వెల్లడించారు.

ఈ నెల 10న తేదీన అనంతపురంలో నిర్వహించే సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభ నిర్వహిస్తామని, సభకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరు కానున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు, అనుబంధ సంఘాల సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎరువుల కొరత లేకుండా చూడండి..

- 8న అన్ని మండల కార్యాలయాల వద్ద నిరసన
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.వేమయ్య యాదవ్

విశాలాంధ్ర-కదిరి : రైతులకు యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి యం.వేమయ్య యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పట్టణ సిపిఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రైతాంగానికి సకాలంలో ఎరువులు అందించక పోవడం శోచనీయమన్నారు. కేంద్ర రాష్ట్ర పాలక ప్రభుత్వాలు రైతుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయని అధికారంలోకి రాకముందు రైతే రాజు,రైతు లేనిదే రాజ్యము లేదని గొప్ప గొప్ప ప్రగల్భాలు పలికారని, అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు తుంగలో తొక్కరని విమర్శించారు.ప్రభుత్వ విధానాల కారణంగా రైతులు ప్రతి యేటా అప్పుల ఊబిలో కూరుకుపోయి కోలుకోలేని స్థితిలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లాలోని ప్రతి రైతుకు ప్రత్యామ్నాయ నాణ్యమైన విత్తనాలు ఉచితంగా అందించి జిల్లాకు తగినంత యూరియా రైతులకు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్ మోటార్లకు,స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియను తక్షణం రద్దు చేయాలన్నారు. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరంతో పాటు రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులు విడుదల చేయాలని కోరారు.ఎన్నికల వాగ్దానంగా ప్రకటించిన ప్రతి రైతుకు రూ. 20వేలు సాగుసాయం తక్షణం విడుదల చెయ్యాలన్నారు..రైతు రుణ విమోచన చట్టం తేస్తూ,రైతుల రుణాలన్నింటిని ఒక పర్యాయం మాఫీ చేయాలని,పాడి రైతులకు మద్దతు ధర కల్పించాలన్నారు.కౌలు రైతుల రక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తేవాలి.2013 భూ సేకరణ చట్టంలో రైతు వ్యతిరేక అంశాలను రద్దు చేయాలని కోరారు. భీమా రుసుం ప్రభుత్వాలే భరించి,50 సంవత్సరాలు నిండిన రైతులకు రూ.10 వేలు పెన్షన్ మంజూరు. చెయ్యాలని కోరారు.నకిలీ విత్తనాలు,ఎరువులు, పురుగు మందులు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో రైతులతో ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి నల్లజోడు పవన్ పట్టణ సహాయ కార్యదర్శి మనోహర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రమణ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

విశాలాంధ్ర-చిలమత్తూరు/ గుడిబండ/ముదిగుబ్బ/బుక్కపట్నం: జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను జాయింట్ కలెక్టర్ అవార్డులతో సత్కరించారు. చిలమత్తూరు మండలం దేమకత్తేపల్లి పంచాయితీ గాద్రాళ్లపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, నౌషద్ అలీ, గుడిబండ మండలం మందలపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రంగనాథ్, ముదిగుబ్బ మండలంలోని నాగులగుబ్బ గ్రామ మోడల్ ప్రైమరీ స్కూల్లో టీచర్ డి.అనురాధ, బుక్కపట్నం మండలం ధూపం పల్లి ఎంపిఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బులగొండ్ల తిప్పన్నలకు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఈవో కిష్టప్పలు ప్రశంశాపత్రం, జ్ఞాపికను అందజేసి సన్మానించారు. బోధన పట్ల వారి అంకిత భావాన్ని అభినందించారు.

నేత్రదానంపై అవగాహన కల్పించండి

విశాలాంధ్ర-ధర్మవరం: నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని రిటైర్డ్ జిల్లా అంధత్వ నివారణ అధికారి సంకారపు నర్సింలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్యులకు, కార్యాలయ సిబ్బందికి నేత్రదానంపై, నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా నిర్వహించారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ వ్యక్తి చని పోయిన 6 గంటలలోపు రక్త బంధువులు దగ్గరలోని నేత్ర నిధికి గాని, కళ్ళు సేకరించే కేంద్రానికి గాని, స్వచ్ఛంద సంస్థల వారికి గాని సమాచారాన్ని అందించాలని తెలిపారు. స్వీకరించిన కళ్ళను అవసరమైన వారికి ఉచితంగా అమర్చడం జరుగుతుందన్నారు. చక్కెర వ్యాధిగ్రస్తులు, కంటి శుక్లాం ఆపరేషన్ చేయించుకున్న వారు కూడా కళ్ళు దానము చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో సూపర్డెంట్ మాధవి, రోటరీ క్లబ్ అధ్యక్షులు నాగభూషణం సంక్షేమ జిల్లా కన్వీనర్ పవన్ కుమార్, రెడ్ క్రాస్ కార్నియా రిటీవల్ టెక్నీషియన్ రాఘవేంద్ర, రోటరీ క్లబ్, రెడ్ క్రాస్, సంక్షేమ సేవా ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-ధర్మవరం: అనంతపురం రాజీవ్ కాలనీ గ్రామానికి చెందిన నాగేంద్ర రోడ్డు ప్రమాదం ద్వారా మరణించడం జరిగింది. వారి ఆర్థిక పరిస్థితి బాగాలేదని సోషల్ మీడియా ద్వారా తెలిసిన వెంటనే సుజాత, హేమలత, శ్రీలత, వారి ఆర్థిక సహకారంతో 50 కేజీల బియ్యం ప్యాకెట్టు ఒక నెలకు సరిపడే సరుకులు పంపిణీ చేశారు. భవిష్యత్తులో పిల్లల చదువులకు సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో హేమలత, శ్రీలత, సుజాత, కేతా లోకేష్, సందీప్, కన్నా వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే మార్గదర్శకులు

విశాలాంధ్ర-ధర్మవరం : ఉపాధ్యాయులే విద్యార్థులకు మార్గదర్శకులు అవుతారని ప్రిన్సిపాల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వనిత వాణి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వనిత వాణి, పద్మావతి కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులను జానవంతులుగా తీర్చిదిద్దడంలో గురువు కృషి వెలకట్టలేనిదని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులను సత్కరించారు. పట్టణంలోని ఏపీ యుఎస్ కార్యాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ 138వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. చిత్రపటానికి జిల్లా గౌరవ సలహాదారులు అన్నం అరవిందు, ఏపీ యుఎస్ నాయకులు పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయులు సుజనారాణి, రమణమ్మ, లక్ష్మీనారాయణ ,గోవర్ధన్, సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.

కొత్తపేట ఉషోదయ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో యువర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రిటైర్డ్ అయిన సుబ్బారత్నమ్మ, నాగేంద్ర కుమార్ వారిని ఘనంగా సత్కరించారు. యువర్ ఫౌండేషన్ అధ్యక్షులు నాగేంద్ర, కార్యదర్శి జయరాం, సహకార దర్శి రమేష్ బాబు సభ్యులు చాంద్బాషా, వైకే శ్రీనివాసులు, కోటేశ్వరరావు, ఓవి.ప్రసాద్, మల్లికార్జున, ఖలీల్, సికిందర్, కేతా లోకేష్ పాల్గొన్నారు.

రోగులకు సేవ చేయుటలో ఎంతో తృప్తి

విశాలాంధ్ర-ధర్మవరం: రోగులకు సేవ చేయుటలో ఎంతో సంతృప్తి ఉందని కన్వీనర్ నామప్రసాద్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 380 మంది రోగులకు శ్రీ సత్య సాయి సేవ సమితి గాంధీ నగర్ వారి ఆధ్వర్యంలో ఆసుపత్రి వైద్యులు సిబ్బంది చేతుల మీదుగా భోజనపు ప్యాకెట్లను, వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. గర్భిణీ స్త్రీలకు ప్రత్యేకంగా స్వీట్లు పంపిణీ చేశారు. దాతలుగా కీర్తిశేషులు దాసరి తులసమ్మ వెంకటస్వామి వ్యవహరించారు.

ఉత్కంఠ భరితంగా క్రికెట్ టోర్నీ

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని ఆర్డీటి మైదానంలో శుక్రవారం 17వ రోజు, అటల్ బిహారి వాజ్‌పాయ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ సీజన్-2 పోటీలు ఉత్కంఠభరితంగా కొనసాగాయి. రోజు తొలి మ్యాచ్ బ్లూ క్యాప్స్.. మైట్ వారియర్స్ జట్ల మధ్య సజావుగా జరిగింది. ఈ మ్యాచ్‌కు బీజేపీ నాయకులు పోతుకుంట రాజు టాస్ వేసి ప్రారంభించారు. బ్లూ క్యాప్స్ జట్టు 72 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం మైట్ వారియర్స్ జట్టు అద్భుతమైన ఆటతీరుతో కేవలం 6 వికెట్లు కోల్పోయి 73 పరుగులు సాధించి, 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మైట్ వారియర్స్ జట్టుకు చెందిన చెన్న అద్భుతమైన ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. విజేతకు ధర్మవరం బీజేపీ నాయకులు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. రేపటి నుండి క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌లు ఉంటాయి.

సభను విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర-ధర్మవరం: ఈనెల 10వ తారీఖు అనంతపురం పట్టణంలో జరగనున్న సూపర్ సిక్స్‌సూపర్ హిట్ సభకు టీడీపీ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని టీడీపీ శ్రేణులు పిలుపునిచ్చారు. శుక్రవారం మాట్లాడుతూ ముఖ్య అతిథులుగా ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు వస్తారని, శనివారం మధ్యాహ్నం 3:00 గంటలకు ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ అధ్యక్షతన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులుగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపీఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ప్రభాకర్, ధర్మవరం నియోజకవర్గ పరిశీలకులు నాగేంద్ర కుమార్ శనివారం మధ్యాహ్నం 3:00గంటలకు ధర్మవరం పట్టణం ఎర్రగుంట సర్కిల్లో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్దకు విచ్చేయనున్నారు. రాష్ట్ర,జిల్లా, నియోజకవర్గ, మండల,గ్రామ పార్టీ కమిటీ సభ్యులు మండల, పట్టణ కన్వీనర్లు మండల పట్టణ పార్టీ కమిటీ సభ్యులు క్లస్టర్ ఇంచార్జిలు,యూనిట్ ఇన్చార్జులు, తెలుగు యువత, పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. టీడీపీ కార్యాలయంలో సభకు జన సమీకరణపై సలహాలు ఇవ్వాలని సూచించారు.

మానవతా విలువలు కాపాడుకుందాం

ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

విశాలాంధ్ర-కదిరి : మానవతా విలువలను కాపాడుకుందామని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా ఇస్లాం మతానికి పర్వదినాన్ని పురస్కరించుకొని జరుపుకునే మిలాద్ ఉన్ నబీ శాంతి ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ కులాలకు, మతాలకు అతీతంగా మహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, ప్రేమ,సహన భావలను గుర్తు పెట్టుకుని జీవితంలో ఆచరించాలని కోరారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శప్రాయుడు

విశాలాంధ్ర-పుట్టపర్తి: ప్రతి ఉపాధ్యాయుడు, ప్రతి విద్యార్థిని భావిభారత పౌరుని గా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర వహిస్తారని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్నారు. శుక్రవారం విద్యా శాఖ ఆధ్వర్యంలో స్థానిక జగ రాజుపల్లి మంగళకర పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శప్రాయుడని నిత్యాన్వేషణలో ఉండి ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేయాలని అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ మంచి ఉపాధ్యా యుడని భారతదేశ రాష్ట్రపతిగా పనిచేశాడన్నారు. పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలంటే ఒక ఉపాధ్యాయునికే సాధ్యమని అన్నారు. డీఈఓ కృష్ణప్ప సర్వ శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ దేవరాజు ఏపీ మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ సద్దలపల్లి గంగాధరప్ప ఏపీ కురుబ, కురుమ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బుక్య కాలే నాయక్ ఏపీ ట్రైబల్స్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులు సభావాత్ సోమ్లా నాయక్ ప్రసంగించారు. విద్యారంగానికి చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కాబడిన 71 మంది ఉపాధ్యాయులకు జ్ఞాపికలను ప్రశంసా పత్రాలతో సత్కరించారు.

క్రాప్ ఇన్సూరెన్స్‌తో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేయాలి

సీపీఐ నాయకులు

విశాలాంధ్ర-ముదిగుబ్బ: మండలంలో పంటలు నష్టపోయిన రైతన్నలకు క్రాప్ ఇన్సూరెన్స్ పాటు ఇన్పుట్ సబ్సిడీ పరిహారాన్ని కూడా తక్షణమే మంజూరు చేయాలని శుక్రవారం ముదిగుబ్బలో విలేకరుల సమావేశంలో సిపిఐ పార్టీ మండల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, ఆ పార్టీ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలోనే విస్తీర్ణంలో పెద్ద మండలంగా పేరుగాంచిన ఈ ప్రాంతంలో 70 శాతం మంది వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారని, తరచూ అతివృష్టి అనావృష్టి కారణాలతో కనీస పెట్టుబడులు కూడా దక్కక రైతన్నలు తమ పంటలు నష్టపోతున్నారని పేర్కొన్నారు, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం రైతన్నలకు బీమా పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ ఒక్క పైసా కూడా చెల్లించకపోవడం దారుణం అన్నారు, పంటల రుణాల రెన్యువల్ ప్రక్రియలో భాగంగా ఇన్సూరెన్స్ కోసం ప్రీమియం చెల్లించడమే కాక ఫసల్ బీమా పథకం ద్వారా కూడా చాలామంది వేరుశనగ, కంది, తదితర పంటలతో పాటు పండ్ల తోటలకు కూడా ముఖ్యంగా మామిడి పంటకు ఎకరాకు రూ. 2000 ప్రీమియం చెల్లించారన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు సంబంధించి ఈ మేరకు బీమా పరిహారం విషయమై తాము ఇటీవల సంబంధిత ఇన్సూరెన్స్ అధికారులను ఫోన్లో సంప్రదించగా మూడేళ్ల నుంచి ఇన్పుట్ సబ్సిడీ పెండింగ్లో ఉందని అది మంజూరైతే తప్ప ఇన్సూరెన్స్ పరిహారం రాదని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు, రెండు మూడేళ్లుగా ప్రభుత్వం తరచూ ఈ ప్రాంతాన్ని కరువు మండలంగా ప్రకటించడంతో పాటు గత ఏడాది కరువు బృందం కూడా ఈ మండలంలో పర్యటించి రైతన్నల పంటల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించినా ఏమాత్రం ప్రయోజనం చేకూర్చకపోవడం విచారకరమన్నారు, ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే పంటలు నష్టపోయిన రైతులకు బీమా పరిహారంతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేయాలన్నారు, లేనిపక్షంలో రైతన్నలత ఆందోళన కార్యక్రమం చేపడతామని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల సహాయ కార్యదర్శి ఈశ్వర్ నాయక్, రైతు సంఘం నాయకులు గంగిరెడ్డిపల్లి నాయుడు, స్థానిక నాయకులు రాధాకృష్ణ, కొండయ్య, లింగుట్ల వెంకట రాముడు పాల్గొన్నారు.

కేజీబీవీ ఎస్ఓ నీలిమాకు జిల్లా ఉత్తమ అవార్డు

విశాలాంధ్ర-లేపాక్షి: కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారిణి నీలిమ జిల్లా ఉత్తమ ప్రత్యేకాధిరిణిగా జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ చేతులు మీదుగా శుక్రవారం ఉదయం అవార్డు తీసుకున్నారు. ఈమె విద్యాలయంలో ఎన్రోల్మెంట్, మెరుగైన ఫలితాలు సాధించడం, లీడర్ సిప్ శిక్షణకు ఎంపిక కావడం పట్ల అవార్డు దక్కింది. అదేవిధంగా విద్యాలయంలో ఫిజికల్ సైన్సు సిఆర్టిగా పనిచేస్తున్న రాజేశ్వరి కూడా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు జేసీ చేతులు మీదుగా అందుకున్నారు. అవార్డు గ్రహీతలకు ఎంఈఓలు, తహసిల్దార్, ఉపాధ్యాయులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇవాళ అందుకోవడం చాలా సంతోషంగా ఉందని ఈ రోజు నుంచి మరింత బాధ్యత నాపై ఉందని ఈ అవార్డు ఉపాధ్యాయుల బృందం విద్యార్థుల క్రమశిక్షణకు వచ్చిన అవార్డు అన్నారు.

గురుపూజోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-రొళ్ళ : స్థానిక మురళి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు వేడుకలకు అధ్యక్షులుగా పాఠశాల కరస్పెండెంట్ శ్రీసన్నతిమప్ప ముఖ్య అతిథులుగా విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీజయశంకర్ హాజరయ్యారు పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీ ఆనంద్ ఆధ్వర్యంలో డాక్టర్.సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత చరిత్రను వారికి ఉపాధ్యాయ వృత్తి పట్ల ఉన్న ఆసక్తిని క్షుణ్ణంగా విద్యార్థులకు వివరించారు విద్యార్థులు ఏస్థాయికి చేరుకున్న వారు గర్వంగా చెప్పుకునేలా ఉపాధ్యాయులు కృషి కీలకంగా ఉండాలని తెలిపారు.గురుపూజోత్సవ వేడుకలు సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు అందులో గెలుపొందిన ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు.

నిరుపేద యువతికి పెళ్లి సామగ్రి పంపిణీ

విశాలాంధ్ర-గోరంట్ల: జమియత్ ఉలమా ఏ-హింద్ గోరంట్ల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని మక్కా మసీదు ప్రాంతం లో కాపురం ఉంటున్న గొల్లపల్లి చాంద్ బాషా కుమార్తె నిఖా సహాయార్థంగా బీరువా , మంచస్త తదితర పెళ్లి సామగ్రిని కమిటీ సభ్యులు అందజేసారు, పెళ్లి కుమార్తె తండ్రి సహాయం చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు, నిరుపేదలకు సహాయం అందించడంలో జమియత్ ఉలమా ఏ హింద్ ముందుంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. జమియత్ ఉలమా ఏ హింద్ గోరంట్ల మండలం అధ్యక్షులు మౌలానా షఫీవుల్లా, ఉపాధ్యక్షులు మౌలానా అబ్దుల్లా మౌలానా పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కుల సంఘాలకు వారధిగా ఉంటా..

శాలివాహన కార్పొరేషన్ చైర్మన ఈశ్వర్

విశాలాంధ్ర-నంబులపూలకుంట: మండల పరిధిలోని వంకమద్ది గ్రామంలో కుమ్మర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ పేటేటి నరసింహులు ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ మాట్లాడుతూ, కుల సంఘాలు సమాజంలో ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు.శాలివాహన కులం రాష్ట్రంలో బలహీనంగా ఉందని,ఆర్థికంగా,సామాజికంగా,రాజకీయంగా బలోపేతం చెందటానికి కృషి చేస్తానని తెలిపారు. ఇక్కడి సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని,పేద పిల్లల చదువులకు దాతల ద్వారా సహకారం అందిస్తానని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు తమ కులానికి చేరేలా చూడటం తమ ప్రధాన కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు.త్వరలోనే ఆదరణ పథకం ద్వారా విద్యుత్ పరికరాలు మంజూరు చేస్తామన్నారు. కుల సంఘాలు సమాజాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.పేటేటి నరసింహులు మాట్లాడుతూ, కుల సంఘాల ఐక్యతతోనే సామాజిక బలపాటు వస్తుందని, ప్రభుత్వ పథకాల సద్వినియోగం ద్వారా ప్రతి కుటుంబం ఆర్థికంగా ముందుకు సాగాలని కోరారు. సమావేశంలో సాగునీటి వైస్ చైర్మన్ నాగేంద్ర,శాలివాహన మండల అధ్యక్షుడు సూర్యనారాయణ,ఉపాధ్యక్షుడు నాగార్జున,గ్రామ టిడిపి అధ్యక్షుడు భద్రయ్య, చంద్ర, అంజి, ఓబన్న, బయన్న,బాబు,నాగరాజు తదితర సంఘానికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

టీచర్స్ క్రికెట్ టోర్నీ విజేత రొద్దం జట్టు

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ డివిజన్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో, యుటిఎఫ్ సీనియర్ నాయకులు, కీ"శే" రామాంజనేయులు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు జ్ఞాపకార్థం, జిల్లా స్థాయి టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను పెనుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో టోర్నమెంట్ కన్వీనర్ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో ఫైనల్ మ్యాచ్ రోద్దం, ఎన్‌పి,కుంట జట్ల మధ్య పోటీ జరిగింది. రోద్దం జట్టు ఎంపీ కుంట జట్టు పై, విజయం సాధించింది. ఉత్తమ ఆటగాళ్లకు ఉత్తమ బౌలర్లకు ఉత్తమ బ్యాట్స్‌మెన్‌లకు ముఖ్య అతిథులు వాణి, ఎంఈఓ రాఘవయ్య, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు జయచంద్ర రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, శివయ్య, శ్రీనివాసులు ,ప్రభాకర్ పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

విశాలాంధ్ర-తలుపుల : ఉబర్లాండ్లపల్లి గ్రామంలో జ్వరాల నివారణ ముందస్తు చర్యల్లో భాగంగా తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఆఫ్తాఫ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా త్రాగే నీటిని కాచి చల్లార్చి తాగాలని, ఇంటి వద్ద ఇంటి చుట్టుపక్కల పరిసరాల్లో శుభ్రంగా ఉంచుకోవాలని.. ఇంట్లోని తొట్లు, కుండలు, డ్రమ్ములు వారానికి ఒకసారి శుభ్రంగా కడిగి ఆరబెట్టి నీటిని పట్టుకోవాలని సూచించారు. డెంగీ, మలేరియా లాంటి విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా లార్వాలను నిర్మూలించుకోవాలని తెలియజేశారు. ప్రజలకు రక్త పరీక్షలుచేసి మందులు పంపిణీ చేశారు. తలుపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆఫ్తాఫ్ తలుపుల హెల్త్ సూపర్వైజర్ రామ్మోహన్, తలుపుల 2 సీహెచ్ఓ శ్రీవాణి పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ఇక్కట్లు

విశాలాంధ్ర-కొత్తచెరువు: ఖరీఫ్‌లో వరి పంటలు సాగు చేసిన రైతులు యూరియా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్త చెరువులో గ్రామీణ బ్యాంకు వద్ద ఉన్న రైతు సేవ కేంద్రం వద్ద శుక్రవారం ఉదయం నుండి సాయంకాలం వరకు యూరియా కోసం బారులు తీరారు. ఇక్కడికి 160 బస్తాల యూరియా రావడంతో ఆధార్ కార్డు ఉన్న వారికి ఒక మూట చొప్పున పంపిణీ చేశారు. పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, యూరియాను దగ్గరుండి రైతులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నటరాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడాకారులకు అభినందన

విశాలాంధ్ర-అగళి : జిల్లా స్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీలో అగళి మండలం వాలీబాల్ పేయర్లు సత్తాచాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. సెప్టెంబర్ 07 విజయవాడలో జరిగే స్టేట్ లెవెల్ వాలీబాల్‌కి వెళ్తున్న అగళి ప్లేయర్స్ జె.యశ్వంత్, ఎస్.లోహిత్, ఎల్ మారుతీ, ఆర్.నవీన్, అర్సాత్, కారియన్న, ఎన్ .హరీష్, ఎన్ మూర్తి, పృథ్వీ, మంజునాథ్, నాగరాజు, ఎస్.మూర్తి, ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. అభిమాన్యు స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ నాగేంద్ర, సింగిల్ విండో డైరెక్టర్ కుమారస్వామి,జడ్పీటీసీ ఉమేష్, మండల కన్వీనర్ తిప్పేస్వామి, ఈరన్న,సి.నారాయణప్ప, కొల్లేష్, చార్లెస్ నాగరాజు, డీసీపీ రామచంద్ర, జివిఎస్ .సురేష్,హేమంత్ కుమార్, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనది..

విశాలాంధ్ర-ధర్మవరం: ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఎంతో విలువైనదని మానవతా సంస్థ చైర్మన్ తల్లం నారాయణ మూర్తి తెలిపారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ తరపున సర్వేపల్లి రాధాకృష్ణ పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని దుర్గా నగర్ ఎస్సీ గర్ల్స్ హాస్టల్లో టీచర్స్ డే నిర్వహించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులైన లక్ష్మీనారాయణరెడ్డి సూర్జహాన్లను మానవతా సంస్థ వారు ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయి పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జగ్గా వేణుగోపాల్, ఉపాధ్యక్షులు మంజునాథ్, కోశాధికారి చల్లా చంద్రశేఖర్, మనోహర్ గుప్తా, హాస్టల్ వార్డెన్ లత పాల్గొన్నారు.

విద్యార్థులందరూ కూడా క్రమశిక్షణతో చదువులు కొనసాగించాలని లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు పిట్టా వెంకటస్వామి, అధ్యక్షులు రమేష్ బాబు, కార్యదర్శి నాగేంద్ర, కోశాధికారి వెంకటేష్ కుమార్ తెలిపారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో టీచర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత విలువలు కలిగిన ఉపాధ్యాయులుగా రాణించాలని తెలిపారు. 30 ఏళ్ల సేవలందించి ఎందరో ఉన్నత శిఖరాలకు చేర్చిన ఉపాధ్యాయులైన విశ్వరూప్, సుధాకర, ఓబులేశు, గోవిందులను లైన్స్ క్లబ్ వారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జోనల్ చైర్మన్ వేణుగోపాలాచార్యులు, శివ ప్రసాద్, చందా నాగరాజు, వెంకట పార్థసారథి, శివ కృష్ణ పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, శనివారం 06, సెప్టెంబర్ 2025

7న ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రధానోత్సవం

విశాలాంధ్ర-ధర్మవరం : సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ధర్మవరం పట్టణంలోని ఎన్జీవో హెూం కార్యాలయం నందు సెప్టెంబర్ 7వ తేదీ ఆదివారం రోజున ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ ధర్మవరం జోన్ సహకారంతో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా వివిధ కేడర్లలో విశేష సేవలు అందిస్తున్న 67 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందజేయనున్నట్లు ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వాహకులు స్థానిక ఎన్జీవో కార్యాలయం ముందు సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఆత్మీయ ట్రస్ట్, యుటిఎఫ్ ధర్మవరం జోన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటుడు వెల్లంకి నాగినీడు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణ కోసం, బోధనలో విశేషమైన సేవలు అందిస్తూ విద్యార్థుల భవితకు బాటలు వేస్తున్న 67మంది ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కాబట్టి ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు అందరూ స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామకృష్ణ నాయక్, యూటీఎఫ్ నాయకులు ఆంజనేయులు, హరికృష్ణ, వెంకట కిషోర్, అమర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కాయగూరల మార్కెట్ వీధిలో గల సాధన ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో టీచర్స్ డే వేడుకలను కరెస్పాండెంట్ సీతాపతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ గర్ల్స్ హై స్కూల్ హెడ్మాస్టర్ రాంప్రసాద్, రిటైర్డ్ ఆంగ్ల ఉపాధ్యాయులు హనుమంత రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అన్ని వృత్తుల కన్నా ఎంతో విలువైనదని తెలిపారు. ఉపాధ్యాయుడు బోధించిన తీరులోనే శిష్యులు యొక్క భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని తెలిపారు. అనంతరం సాధన స్కూల్ వారు ముఖ్య అతిథులతో పాటు పాఠశాల టీచర్లు అరుణ, మీనజ్‌ను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు భువనేశ్వరి దేవి ,నాగార్జున బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు. కాకతీయ విద్యానికేతన్ లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు కరెస్పాండెంట్ నిర్మల జయచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో జరుపుకున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మన జీవిత ములో ఉన్నత స్థానం గురువుకు మాత్రమే ఉంటుందన్నారు. డైరెక్టర్లు సూర్యప్రకాశ్ రెడ్డి, పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

విశాలాంధ్ర-శింగనమల: మండల పరిధిలోని పెరవలి గ్రామం నాయనపల్లి క్రాసింగ్ లో గల శ్రీ లక్ష్మి నరసింహ ఆగ్రో ఏజెన్సీ ఎరువుల దుకాణాన్ని కలెక్టర్ వినోద్ కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలో లైసెన్స్, స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్ మరియు గోడౌన్ లోని ఎరువులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అక్కడ రైతులతో ఎరువుల గురించి ఆరా తీశారు.ఎరువుల బస్తా బరువు కూడా తనిఖీ చేశారు. జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఎలాంటి అపోహలు పెట్టుకోరాదని, ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. రైతులకు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని, రైతులకు యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుకు కావలసిన ఎరువులు మాత్రమే అందచేయాలనీ ఇతర పదార్థాలు జోడించి అమ్మకాలు జరుపరాదని, అధిక ధరలకు అమ్మరాదని సూచించారు. అట్టి చర్యలు చేపడితే దుకాణదారులపై చట్ట పరమైన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ శేషారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్, డీఎమ్ మార్క్ఫెడ్, సి ఎస్‌డిటి, ఏఎస్ఐ, జిల్లా ఉద్యాన శాఖ అధికారులు, మండల వ్యవసాయ అధికారి అన్వేష్ కుమార్ పాల్గొన్నారు.

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్

విశాలాంధ్ర-గుంతకల్లు: యువత వారి ప్రతిభను కనబరిచి మరింత పై స్థాయికి పోవాలని రూరల్ ఎస్సై వెంకట స్వామి అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో, కసాపురం సీనియర్ క్రికెటర్ల సహకారంతో క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్స్ ను కసాపురం సబ్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి , సీనియర్ క్రికెటర్స్ చక్రవర్తి, ఎర్రి స్వామి, తిరుపాల్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కసాపురం రమేష్ , డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్రబాబు విడుదల చేశారు. అనంతరం వారుమాట్లాడుతూ ఈనెల 28 నుంచికసాపురంలోని మారుతి నగర్ దగ్గర ఈ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందినీ అన్నారు. టీములు నమోదు చేసుకునేవారు ఈనెల 25 లోపల నమోదు చేసుకోవాలనీ పట్టణాలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున యువత ఈ టోర్నమెంట్‌లో పాల్గొని తమ ప్రతిభను కనబరిచి మరింతపై స్థాయికి పోవాలని అన్నారు. ఈ మధ్యకాలంలో యువత వ్యసనాలకు బానిసలు అవుతూ అనేక బెట్టింగ్ యాప్ లు మరియు మాదకద్రవ్యాలు ద్వారా యువత పెడదోవ పడే పరిస్థితి కనపడుతుందినీ బెట్టింగ్ యాప్ లను మరియు మాదక ద్రవ్యాలను నివారించి క్రీడా పోటీలో మంచి ప్రతిభను కనపర్చి ఈ టోర్నమెంట్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ టోర్నమెంట్లో ప్రతిభ కనబరిచిన వారికి మొదటి బహుమతిగా రూ.20016 రెండో బహుమతిగా 10016 మూడో బహుమతిగా 5016 ప్రకటించడం జరుగుతుం దని అన్నారు. టీం నమోదు చేసుకోవాల్సిన వారు ఈనెంబర్లకు 8897729429, 9908504321, 8919026797, 9959451457 సంప్రదించాలని అన్నారు. త్యాగరాజ్, రాజశేఖర్,కావలి రమేష్ రంగా,రంగస్వామి ,హరి,దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్దేహాళ్‌లో అన్నదాన కార్యక్రమం

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండలంలోని ఉద్యహాల్ గ్రామంలో ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ని నబి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మిలాద్ ఉని నబి సందర్భంగా గ్రామతెలుగుదేశం పార్టీ యువ నాయకుడు మున్నా ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు రజిని కుమారికి సన్మానం

విశాలాంధ్ర-ఉరవకొండ: వజ్రకరూరు మండలం చిన్న హెూతూరు గ్రామంలో ప్రభుత్వ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రజిని కుమారి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైంది. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని అనంతపురంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రజిని కుమారి జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మ, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వారు ఆమెను ఘనంగా సన్మానించి అభినందించారు. ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎన్నికైన రజిని కుమారికి జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

విశాలాంధ్ర-గుంతకల్లు: స్థానిక ఐదవ వార్డు సచివాలయం అంబేద్కర్ నగర్‌లో భారత రాజ్యాంగ అవగాహన వేదిక ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. శుక్రవారం సావిత్రి బాయ్ పూలే చిత్రపటానికి ఉపాధ్యాయులు మురళీమోహన్ పూలమాల వేసి నివాళులర్పించారు. సమావేశాన్ని అధ్యక్షతగా మురళీమోహన్ వహించారు. మహిళా విభాగ అధ్యక్షురాలు జింకల సరస్వతి మాట్లాడారు... కార్యక్రమానికి ఐదో వార్డ్ కన్వీనర్ రామాంజనేయులు, జింకల మంజువాణి, రాజేంద్రనగర్ 12వ వార్డు కన్వీనర్ విజయ కుమారి, తిలక్ నగర్ కన్వీనర్ షాజిది బేగం , తలారి ఆనంద్, రాజు తదితర కాలనీవాసులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు అన్నదానం

విశాలాంధ్ర-తలుపుల: స్థానిక మండల కేంద్రంలోని చింతవనం దగ్గర బతుకుదెరువు వచ్చిన పేద ప్రజలకు చిన్న పిల్లలకు మదర్ తెరిసా వర్ధంతి సందర్భంగా రూరల్ డెవలప్మెంట్ ఫ్రెండ్స్ ట్రస్ట్‌లి ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ట్రస్ట్ సభ్యులైన మన్సూర్ మాట్లాడుతూ మదర్ తెరిసా భారతదేశంలో పుట్టలేదు, తన జాతి కాదు, ఏ స్వార్థము లేకుండా పేద ప్రజలకు, అనాథలకు మరియు రోగులకు తన జీవితాన్ని అంకితం చేసిన కరుణామయి మదర్ తెరిసా అని తెలియపరిచారు. పదిమందికి అన్నం పెట్టకపోవచ్చు కానీ ఒక్కరికి పెట్టు చాలుఅని గొప్ప నినాదం ఇచ్చిన మదర్ తెరిసా స్ఫూర్తితో రూలర్ డెవలప్మెంట్ ఫ్రెండ్స్ ట్రస్ట్ స్థాపించామని తెలియజేస్తూ. ఈ ట్రస్ట్ ఎప్పటికీ పేద ప్రజలకు ఆకలి తీరుస్తూ , సహాయంగా ఉంటుందని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో ఎద్దుల రాముడు, మలహెూత్ర, కళ్యాణ్, బావాజీ మరియు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీ రూపురేఖలు మార్చేస్తాం

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ మునిసిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చి దిద్ది అభివృద్ధి చేస్తామని మంత్రి సవితమ్మ తెలిపారు.పెనుకొండ పట్టణంలో ఆహుడా చైర్మన్ టీసీ వరుణ్ తో కలసి 92 లక్షల రూపాయల నిధులతో వై జంక్షన్ నుండి మార్కెట్ యార్డ్ వరకు సెంటర్ లైటింగ్ నిర్మాణము కోసం భూమిపూజ చేసారు. ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ మీడియాతో మాట్లాడుతూ అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎన్నికల హామీలలో భాగంగా ఒక్కొక్కటి నెరవేరుస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రైల్వే స్టేషన్ కి వెళ్లే రోడ్డుకు రూ.50 లక్షల రూపాయలు నిధులతో రోడ్డు పూర్తి చేసామని కోనాపురం గ్రామానికి ఒక కోటి రూపాయలతో బీటీ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. రూ.50లక్షల రూపాయలతో డ్రైనేజీ పనులు త్వరలో జరుగుతున్నాయని అన్నా కాంటీన్ ను 62 లక్షల రూపాయలతో భవనం నిర్మిస్తున్నామన్నారు. రూ.100 కోట్ల రూపాయలతో అమృత్ పథకం కింద మున్సిపాలిటీలో ఇంటింటికి తాగునీరూ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆహుడా సెక్రెటరీ రామకృష్ణారెడ్డి, ఆర్డీవో ఆనంద్ రావు పబ్లిక్ హెల్త్ రామ్మోహన్ రెడ్డి, డిపిహెచ్‌ఈఓ నరసింహ మూర్తి,సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకట రమణ, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు శ్రీనివాసులు, ఆంజనేయులు,కమిషనర్ సతీష్ కుమార్ ,కూటమి నాయకులు జనసేన కుమార్ , సింగల్ విండో అధ్యక్షులు పోతిరెడ్డి, రామకృష్ణ,బిజెపి రామకృష్ణ, కన్వీనర్లు శ్రీరామ్ యాదవ్ , ఈశ్వర ప్రసాద్ ,నారాయణస్వామి, కేశవయ్య, కార్యకర్తలు కూటమి నాయకులు,పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అండగా నిలవలేకపోతున్న ప్రైవేట్ పాఠశాలలు..!

ప్రభుత్వ ఉద్యోగులకు ఫీజుల్లో ప్రత్యేక మినహాయింపు

మనోవేదనలో యాజమాన్యాలు

విశాలాంధ్ర - జేఎన్టీయూ ఏ: సమాజ నిర్మాణంలో ముఖ్యభూమికను పోషించే విద్య జీవనాడిగా నిలుస్తుంది. విద్య వ్యాపారం కాకుండా.. ఎటువంటి లాభా పేక్ష లేని విజ్ఞాన భాండాగారని తయారుచేసి విద్యార్థుల భవితకు, దేశ అభ్యున్నతకు తోడ్పాటు అందించే ప్రైవేటు పాఠశాలలో నిరాశ్రయులకు అండగా నిలువ లేని పరిస్థితి నెలకొంటూ ఉన్నది. అనంతపురం జిల్లాలో ప్రైవేటు పాఠశాలల్లో అత్యధిక శాతం ప్రభుత్వ ఉద్యోగులు అత్యధిక వేతనాలు తీసుకుంటున్న వారి ప్రత్యేక ఫీజుల్లో మినహాయింపును పొందడం గమనార్హంగా ఉంది?. విద్యాశాఖ, రెవెన్యూ, పోలీస్, మున్సిపాలిటీ మొదలగు రంగాలలో అత్యున్నత స్థానంలో ఉండేవారు సైతం.. వారి పిల్లల ఫీజులను తగ్గించాలని.. ఆదేశించడం దేనికి ప్రామాణికం.. డొక్కాడితే కానీ రోజు గడసని వారిని ఫీజు తగ్గించాలంటే ఎన్నో ఆంక్షలు తో కూడిన మార్గదర్శకాలను వారి ముందు ఉంచుతారు. ధనవంతులకు రాజ దర్బార్ తో మినహాయింపులు చేపడుతున్న ప్రైవేటు పాఠశాలల్లో ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మేధావులు వాపోతున్నారు. పాఠశాల నిర్వహణ, అధ్యాపకుల , బోధ నేతర ఉద్యోగుల జీతభత్యాలు, విద్యావిధానాల ప్రమాణాలు, పోటీ, పరిపాలన ఖర్చులు చేపట్టడం కష్టతరంగా ఉందని కొందరు యాజమాన్యాలు మనోవేదనను వ్యక్తం చేస్తున్నారు. మానవతా దృక్పథం.. మరుస్తూ.. నిరుపేదలకు విజ్ఞాన వెలుగును అందించి..ప్రైవేట్ పాఠశాల తోడుగా నిలవవలసిన బాధ్యత ,దేశ అభ్యున్నతకు తోడ్పాటున అందించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఎమ్మెల్యే చొరవతో వీధిలైట్ల ఏర్పాటు

విశాలాంధ్ర-యాడికి: తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి చొరవతో యాడికి మండల కేంద్రం లో శుక్రవారం వీధిలైట్లు ఏర్పాటు చేశారు ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి వారం క్రితం యాడికి పర్యటన లో భాగంగా ప్రజలు వీధి లైట్ల సమస్యను ఆయన దృష్టికి తీసుకురాగా అధికారుల సమీక్ష సమావేశంలో హామీ ఇచ్చిన విధంగా తక్షణమే యాడికి పట్టణం మొత్తం వీధిలైట్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రుద్రమ నాయుడు, సర్పంచ్ పందు అనురాధ, మాజీ ఎంపీటీసీ దడియాల ఆది, ఐ కన్వీనర్ నరసింహ చౌదరి తెలుగు యువత నాయకుడు కోడూరు నీలకంఠారెడ్డి, రహంతుల్లా పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండలోని మండల విద్యాశాఖ కార్యాలయం నందు శుక్రవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి రాఘవయ్యను, మండల ఉపాధ్యాయులు అందరికి శుభాకాంక్షలు తెలియజేసి రిటైర్డ్ ఉపాధ్యాయులు బసిరెడ్డిని సన్మానించారు. రాఘవయ్యని ఉపాధ్యాయ బృందం, ఎంఆర్‌సి సిబ్బంది కలసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నారాయణ స్వామి,రవీంద్ర, నరేష్, బాబు, పెద్దిరాజు,ఉపేంద్ర, హసీనా, సునితమ్మ మరియు సిబ్బంది, మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలో విజన్ విద్యా సంస్థలలో శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినంను పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవంను విజన్ ఉపాధ్యాయ బృందం విద్యార్థుల సమక్షంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విజన్ హై స్కూల్ విద్యాసంస్థల అధినేత విశ్వనాథ్ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ రాష్ట్రపతి స్థానంలో కంటే ఉపాధ్యాయ వృత్తిలో ఎక్కువ సంతృప్తి లభిస్తుందని అన్నారని,ఉపాధ్యాయ వృత్తి అన్ని వృత్తుల్లో ఉన్నవారికి నాంది పలికే ఏకైక వృత్తి అని, ఏ వృత్తిలో ఉన్నవారికైనా ఖచ్చితంగా గురువు ఉంటారని,మనకు మొదటి గురువు అమ్మ, తల్లి వడి లోనే మొదటి విద్యాభ్యాసం జరుగుతుందని,తర్వాత గురువు నాన్న అని ,ఆయనజీవిత విషయాలను,గమ్యాలను ఏర్పరుస్తారని తదుపరి గురువు ఉపాధ్యాయుడు అని, విద్యార్థుల భవిష్యత్తు కొరకు అనునిత్యం నేర్చుకుంటూ, నేర్పిస్తూ వారి బంగారు భవితకు బాటలు వేస్తారని విజన్ విద్యార్థులకు ఉపాధ్యాయులు సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజన్ ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ నాయకుడు వహాబ్ బీడి అయూబ్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వహాబ్ బీడీ అయూబ్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జన్మదిన, మిలాద్ నబి సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేశామన్నారు. టీడీపీ నాయకులు గోరా, ముష్కిన్, కాలేష్ మస్తాన్, యాడికి ఖాదర్ వలి, సయ్యదు బాషా, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రధానం

విశాలాంధ్ర-యాడికి: మండలంలోని రాయల చెరువు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న, వెంగన్న పల్లె గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ తమ విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు జిల్లా కేంద్రం అనంతపురంలో శుక్రవారం ఎస్ ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో జిల్లా విద్యాధికారి ప్రసాద్ బాబు చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులను ప్రధానం చేశారు. ఉత్తమ అవార్డులు పొందిన ఉపాధ్యాయులకు తోటి ఉపాధ్యాయులు డానియల్, కృష్ణ కుమార్ రెడ్డి గ్రామస్తులు అభినందించారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

విశాలాంధ్ర - అగళి : మడకశిర పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో హళ్లికేరా గ్రామానికి చెందిన పలువురు వైఎస్ఆర్ వైఎస్ఆర్సిపి నాయకులు తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఆగళి మండలం హళ్లి కేర గ్రామానికి చెందిన వైసీపీకి నాయకులు ముద్ద రాజు, కావేలప్ప, హరీష్, రంగనాథ్ తెలుగుదేశం పార్టీలోకి చేరగా ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమం లో పరిశీలకులుగా వచ్చిన కడప డిసిసి చైర్మన్ జై ప్రకాష్ , రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి ఒకలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ ఛైర్మన్ రాజు మార్కెట్ యార్డ్ చైర్మన్, గురుమూర్తి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ భక్తర్, సింగిల్ విండో డైరెక్టర్ కుమారస్వామి,జడ్పీటీసీ ఉమేష్,మండల కన్వీనర్ తిప్పేస్వామి మార్కెట్ డైరెక్టర్ శిల్పాకేంచుయాదవ్ మాజీ ఎంపీపీ నరసింహప్ప అన్ని అనుబంధ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

దేవాలయ ధర్మకర్తగా గాజుల విజయకుమార్

విశాలాంధ్ర-కణేకల్లు: కనేకల్ మండల పరిధిలోని మాల్యం గ్రామం నందు గల కల్లేశ్వర స్వామి దేవాలయం నూతన ధర్మకర్తగా గాజుల విజయకుమార్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాయదుర్గం శాసన సభ్యులు కాల్వ శ్రీనివాసులు ఎండోమెంట్ అధికారులు విచ్చేశారు. ఎండోమెంట్ అధికారినిచే నూతనంగా ఎన్నికైన ధర్మకర్త గాజులు విజయకుమార్, సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశం నందు రాయదుర్గం శాసనసభ్యులు కాలువ శ్రీనివాసులు మాట్లాడుతూ మాల్యం గ్రామ అభివృద్ధికి ఆరకోట్ల రూపాయలు రూపాయలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అయినాయని తెలిపారు. ఈ నిధులతో వేదవతి హగిరి కాజువై అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. అనంతరం కల్లేశ్వర స్వామి దేవాలయం అతి పురాతమైనదని ఆయన తెలిపారు. ఈ దేవాలయాభివృద్ధికి తోడ్పడుతామని ఈ సందర్భంగా తెలియ జేశారు. గతంలో కూడా దాదాపు 25 సంవత్సరాల పాటు గాజుల ఫ్యామిలీ ధర్మకర్తగా ఉంటూ ఆలయ భూములు రక్షణ అయితేనేమి అభివృద్ధి అయితేనేమి ఎంతో కృషి చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లాలెప్ప. మార్కెట్ యార్డ్ సభ్యులు చాంద్ బాషా,మరియప్ప, శరభన్న గౌడ,జయరాం చౌదరి,సుదర్శన్ గాజుల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కీర్తన గోల్డ్ లోన్స్ మూడో బ్రాంచ్ ప్రారంభోత్సవం

విశాలాంధ్ర-గుంతకల్లు: పట్టణంలో కీర్తన గోల్డ్ లోన్స్ వారి మూడవ బ్రాంచ్ ప్రారంభోత్సవ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా హాజరైన వైసీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాయి పోగు వీరేష్ బాబు ఆయన చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి నన్ను పిలిచినందుకు మేనేజర్, సింబ్బందికి ధన్యవాదాలు తెలుపుతున్నానునీ అన్నారు. బ్రాంచ్ మేనేజర్ కిషోర్, బ్రాంచ్ ఉద్యోగస్తులంతా , వైసిపి ఎస్సీ సెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

విశాలాంధ్ర-పెనుకొండ: మండల పరిధిలో గుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్నటువంటి నాగార్జునుడు, ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైనందున ఉపాధ్యాయ దినోత్సవం రోజున సత్య సాయి జిల్లా కేంద్రం నందు మంగళకర ఎడ్యుకేషనల్ ట్రస్టు నందు ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో నాగార్జున నీ జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ చేతుల మీదుగా సన్మానం చేశారు ఈ కార్యక్రమంలో డీఈవో కిష్టప్ప ఇతర జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఓనం పండుగ జరుపుకుంటున్న ప్రజలందరికీ శుభాకాంక్షలు

విశాలాంధ్ర-పుట్టపర్తి: కేరళ వాసులకు అత్యంత పవిత్రమైన పండుగ ఓనం పర్వదినం సందర్భంగా పుట్టపర్తి నియోజవర్గంలో నివాసమున్న కేరళ ప్రజలకు ఓనం పండుగ సందర్భంగా పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అత్యంత పవిత్రమైన ఓనం పండుగను కేరళ ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి ఎంతో ఆనందంగా జరుపుకోవాలని ఆ దేవుణ్ణి కోరుకొంటున్నానని, ఈ పండుగను జరుపుకొనే ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఓనం పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

శాన్వి పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

విశాలాంధ్ర-రొళ్ల: దేశం గర్వించదగ్గ స్థాయికి వెళ్లిన గురువు బాధ్యత సమాజంలో మర్చిపోలేనిదని డైరెక్టర్ చిత్తయ్య,కరస్పాండెంట్ పి.రూప పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక శాన్వి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎస్.ఆర్ నాగరాజుప్ప ప్రధానోపాధ్యాయుడు మహేష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులు గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులకు ఆట క్రీడా పోటీలు నిర్వహించారు. అందులో గెలుపొందిన ఉపాధ్యాయులకు పాఠశాల డైరెక్టర్ చిత్తయ్య చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ డైరెక్టర్ కృష్ణమూర్తికి అభినందనల వెల్లువ

విశాలాంధ్ర-కదిరి: ఏపీ స్టేట్ అగ్రికల్చర్ డైరెక్టర్ బంగారు కృష్ణమూర్తికి పలువురి నుండి అభినందనలు వెల్లువెత్తు న్నాయి.ఇటీవల ఏపీ స్టేట్ అగ్రికల్చర్ డైరెక్టర్ నియమితులైన బంగారు కృష్ణమూర్తికి వాల్మీకి సంఘ నాయకులు,ఆర్టీసీ నాయకులు అభినందించారు. అనంతరం బంగారు కృష్ణమూర్తి వాల్మీకి మాట్లాడుతూ తాను ఆర్టీసీ కండక్టర్ నుండి నేడు రాష్ట్ర డైరెక్టర్ వరకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు.తన పైన నమ్మకం ఉంచి ఇచ్చిన పదవిని వమ్ము కాకుండా ఉంటూ పార్టీ కార్యక్రమంలో చురుకయినా పాత్ర పోసిస్తానని తెలిపారు.తనకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆనంద్,నరసింహులు, శివ ప్రసాద్, మోహన్, పరుశురాం, అంజనాదేవి,ప్రమీల,నాగవేణి,నాగేశ్వరి పాల్గొన్నారు.

రహదారి దెబ్బతినడంతో ప్రజల ఇబ్బందులు

విశాలాంధ్ర-అమరాపురం: అమరాపురం మండల కేంద్రంనుంచి మన ఆంధ్ర బార్డర్ విరుప సముద్రం వరకు వెళ్లే దాదాపు 10 కిలోమీటర్ల రహదారి పూర్తిగా దెబ్బతింది. వర్షాకాలం వచ్చాక గుంతలు నిండిపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పగుళ్లు, రాత్రులు గుంతలతో నిండిన రహదారిపై ప్రయాణించడం ప్రజలకు ఒక శాపంగా మారింది. వర్షాలతో దెబ్బతిన్న రహదారి గ్రామస్థుల సమాచారం ప్రకారం, గత నాలుగు సంవత్సరాలుగా ఈ రహదారి మరమ్మతులు చేయలేదు. వర్షాలు కురిసిన ప్రతిసారీ రహదారి మరింత చెడిపోతూ వస్తోంది. ముఖ్యంగా స్కూల్‌కి వెళ్లే చిన్నారులు, మార్కెట్‌కు వెళ్ళే రైతులు, వందల్లో వెళ్లే వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అంబులెన్స్ సకాలంలో గ్రామానికి చేరుకోలేకపోవడం వల్ల అనేకసార్లు ప్రాణాపాయం తలెత్తిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇటీవల ఒక డయాలసిస్ పేషెంట్ ని తీసుకుని పోవడానికి అంబులెన్స్ రాలేనందున డయాలసిస్ పేషెంట్ చాలా ఇబ్బంది పడినాడు అందువల్ల ఆ పేషెంట్‌ను సమయానికి ఆసుపత్రికి తీసుకెళ్లలేకపోవడంతో పరిస్థితి విషమించిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రతిరోజూ ఈ రహదారిపై వందల్లోవాహనాలు, ప్రజలు ప్రయాణించడం జరుగుతుంది. అందువలన వాహనదారులకు చాలా కష్టమైంది. వర్షం వస్తే మట్టిలో వాహనాలు ఇరుక్కుపోతాయి. ఈ రహదారిలో వెళ్లే వాహనధార్లు పడిపడి గాయపడుతున్నారు" అని ఒక స్థానిక రైతు తెలిపారు. "మేము పలుమార్లు అధికారులకు చెప్పాం. కాని ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు" అని గ్రామ ప్రజలు ఆరోపించారు. స్థానిక అధికారులను సంప్రదించగా - "రహదారి మరమ్మతుల ప్రతిపాదన ఇప్పటికే ఉన్నది. త్వరలో నిధులు మంజూరు అవుతాయి. తాత్కాలికంగా గుంతలు పూడ్చే పనులు చేస్తాము" అని తెలిపారు. అయితే ప్రజలు మాత్రం ఇది కేవలం మాటలకే పరిమితం అవుతుందని అంటున్నారు. రహదారి పునర్నిర్మాణానికి తక్షణ చర్యలు తీసుకోవాలని, శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు ఇప్పుడున్న కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. లేకపోతే వచ్చేపంచాయతీఎలెక్షన్లో ఈ కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పుతామని ప్రజలు హెచ్చరించారు.

రక్తదానంతోనే ప్రాణదాతలు కండి

విశాలాంధ్ర-తాడిపత్రి: రక్తదానంతోనే ప్రాణదాతలు కండని దూదేకుల సేవా సంఘం అధ్యక్షుడు డికె. హుస్సేన్ పీరా పేర్కొన్నారు. శుక్రవారం పుట్లూరు రోడ్డులో ఉన్న దూదేకుల సేవా సంఘం కార్యాలయం వద్ద దూదేకుల సేవా సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దూదేకుల సేవా సంఘం అధ్యక్షుడు డికె.హుస్సేన్ పీరా మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జన్మదిన, మిలాద్ నబి సందర్భంగా రక్తదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించి, దాదాపు 65 మంది రక్తదానం చేశారని చెప్పారు. అనంతరం దూదేకుల సేవ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో దూదేకుల సేవా సంఘం సెక్రటరీ వి.హుస్సేన్ పీరా, ట్రెజరర్ గూడూరు మహబూబ్ సాహెబ్, గౌరవాధ్యక్షులు పెయింటర్ బాషా, శింగనమల మెకానిక్ దస్తగిరి, బాబయ్య, కతాలప్ప, సంఘం ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి అవార్డులు

విశాలాంధ్ర-గోరంట్ల : ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని మంగళకర కళాశాల నందు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి క్రిస్టప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల మండలా నికి చెందిన నీలం అశోక్‌కి, జొన్నలగడ్డ చిట్టెమ్మకి కుటుంబ సమేతంగా సన్మానం చేశారు. సన్మానంలో భాగంగా శాలువా, పూలహారం, తాంబూలం, ప్రశంసా పత్రం, ఒక షీల్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ ఉప విద్యాశాఖాధికారి రెడ్డప్ప, గోరంట్ల మండల విద్యాశాఖాధికారి గోపాల్, మండల ఉపాధ్యాయులు దామోదర్ రెడ్డి, నాగరాజు, సరేంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మార్గ నిర్దేశకులు గురువులు

విశాలాంధ్ర - జేఎన్టీయూ ఏ: సమాజంలోని రుగ్మతులను తొలగించి.. మార్గనిర్దేశకులుగా నిలిచేరి గురువులను అని రిజిస్ట్రార్ డా.ప్రదీప్ కుమార్, ప్రిన్సిపల్ డా.రామనాథన్ పేర్కొన్నారు.మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ లో శుక్రవారం డా. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థుల మనసులను గెలవ గలిగేది అధ్యాపకులు మాత్రమే ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాజేష్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

హ్యాండ్ క్రాఫ్ట్ రాష్ట్ర డైరెక్టర్‌కు సన్మానం

విశాలాంధ్ర-గోరంట్ల: హ్యాండ్ క్రాఫ్ట్ రాష్ట్ర డైరెక్టర్ గా గోరంట్ల మండలంకు చెందిన బలిజ సంఘం నాయకులు, టీడీపీ సీనియర్ నాయకులు సోమశేఖర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించిన శుభ సందర్భంగా శుక్రవారం గోరంట్లలోని ఆయన స్వగృహంలో సోమందేపల్లి మండలం శ్రీ సజ్జ గంట రంగనాథ స్వామి బలిజ సంక్షేమ సంఘం నాయకులు.. దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు అశ్వర్థప్ప, ఉపాధ్యక్షులు గుడిపల్లి రమణప్ప, మాజీ అధ్యక్షులు జవాజి రమేష్,నవీన్ కుమార్, ఎల్ ఐ సి రంగనాథం, రామదాసు, శ్రీనివాసులు, అగ్రహారం చలపతి,కొత్తపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.